# సొంతింటి కల సాకారం

పేదల సొంతింటి కలను బీఆర్ఎస్ ప్రభుత్వం మంథని మున్సిపాలిటీలో సాకారం చేసి చూపింది. జీవితంలో కనీసం ఇల్లు కూడా నిర్మించుకోలేని ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న పేదల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో ప్రవేశ పెట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణ పథకం ఓ వరంగా మారింది. అందులో భాగంగా మంథని మున్సిపాలిటీకి 192 ఇండ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే అందులో 70 కుటుంబాలు సంతోషంగా నివసిస్తుండగా, త్వరలోనే మరో వంద ఇండ్ల పంపిణీకి యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది.

- **మంథనిలో 192 డబుల్ బెడ్రూం ఇండ్లు**
- **75 ఇండ్లల్లో సంతోషంగా నివాసముంటున్న పేదలు**
- **త్వరలో మరో 100 ఇండ్ల పంపిణీకి ఏర్పాట్లు**
- **పుట్ట దంపతుల ప్రత్యేక కృషిపై హర్షాతిరేకాలు**



మంథని : పోచమ్మవాడలోని సావిత్రి భాయి పూలే డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం

మంథని, జూలై 3 : రాష్ట్ర ఏర్పాటు తర్వాత మంథని మొదటి ఎమ్మెల్యే, ప్రస్తుత పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మంథనికి డబుల్ బెడ్రూం ఇండ్ల మంజూరు చేయించడంలో, స్థలాల కేటాయింపులో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ ప్రత్యేక కృషి చేశారు. ప్రత్యేక చొరవ తీసుకొని జీ ప్లస్ వన్ తరహాలో పట్టణంలోని పోచమ్మవాడతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని కూచీరాజ్‌పల్లి సమీపంలో పక్కా భవనాలను నిర్మించారు. 30 ఫీట్ల రోడ్ల వెడల్పు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కరెంట్ సప్లై సిస్టంతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పించారు. పోచమ్మవాడలో పూర్తయిన 92 ఇండ్లలో తొలి విడుతలో 75 ఇండ్ల మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా పేదలకు పంపిణీ చేశారు. రూపాయి ఖర్చు లేకుండా సుమారు రూ. 10లక్షలకు పైన విలువ చేసే ఇండ్లలో పేదలు గత కొద్ది నెలలుగా సంతోషంగా నివాసముంటున్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు వచ్చిన పేదల కుటుంబాల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ప్రస్తుతం ఈ ఇండ్లలో నివాసముంటూ కూలీనాలి, చిన్న వృత్తులు చేసుకుంటూ పేదలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు.

**పోచమ్మవాడకు ప్రత్యేక కల**

పేదోడి సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణంతో మంథని పట్టణంలోని పోచమ్మవాడకు ప్రత్యేక కల వచ్చింది. గతంలో పట్టణ శివారులో తుమ్మ పొదలు, పిచ్చి మొక్కలు, బురదతో ఎవరు అటు వైపు కూడా వెళ్లకుండా ఉండే ప్రదేశం నేడు జీ ప్లస్ వన్ బిల్డింగ్‌లు, రోడ్లు, మౌలిక వసతులతో కళకళలాడుతున్నది. పోచమ్మవాడలో 46 జీ ప్లస్ వన్ స్టైల్‌లో ఉన్న భవనాలు అపార్ట్‌మెంట్‌లను తలదన్నేలా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లకు సావిత్రి బాయి పూలే కాలనీగా నామకరణం చేశారు. ఇటీవల వీటిని పేదలకు పంపిణీ చేయడంతో దాదాపు 75 కొత్త కుటుంబాలు ఇక్కడ నివాసముంటుండడంతో సందడిగా మారింది. దాదాపు 300కు పైగా జనాభా ఇక్కడికి రావడంతో జన సంచారంతో శివారు సైతం పట్టణాన్ని తలపించేలా మారింది.

**కూచిరాజ్‌పల్లిలో మరో 100 ఇండ్లు**

మంథని మున్సిపాలిటీ పరిధిలోని కూచీరాజ్‌పల్లి శివారులో మరో 100 డబుల్ బెడ్రూం ఇండ్లు చివరి దశకు చేరుకున్నాయి. ఇక్కడ సైతం జీ ప్లస్ వన్ మాదిరిగా భవన నిర్మాణాలతో పాటు 30 ఫీట్ల రోడ్ల వెడల్పు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కరెంట్ సప్లై సిస్టంతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాలు చివరి దశ అయిన ప్లాస్టింగ్ పనులు జరుగుతున్నాయి. వీటిని సైతం అర్హులైన పేదలకు పంపిణీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.



మంథనిలోని పోచమ్మవాడలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్ నేతకాని, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి డబుల్ బెడ్రూం ఇంటిని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ

### కలల గూడ అనుకోలె

నా భర్త మంథని వెంకటేశ్ 10 ఏళ్ల క్రితమే చనిపోయిండు. నాకు ఒక బాబు ఉన్నాడు. ఏదో చిన్న చిన్న పనులు చేసుకుంట పూట గడుపుతున్నం. మాకు సొంతిల్లు లేదు. ఇల్లు కట్టుకునే తాకతు లేదు. కిరాయికి ఉంటున్నం. అసలు మేం సొంతిల్లు కడ్తమని కలల గూడ అనుకోలె. అసొంటిది నాకు బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇల్లు ఇచ్చింది. పైసా కూడా ఖర్చు లేకుండా మంచిగ డబుల్ బెడ్ రూం ఇల్లు ఇచ్చిన్రు. చాన సంబురమైతంది. సంతోషమైతంది. డబుల్ బెడ్ రూం ఇల్లు ఇచ్చిన సీఎం కేసీఆర్, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు రుణపడి ఉంటా.

**-మంథని రాజేశ్వరి, మంథని**



డబుల్ బెడ్రూం ఇంటిలో మంథని రాజేశ్వరి

### ఏటా వరదలతో మా ఇల్లు మునిగేది



నా చిన్నతనంలోనే మా నాన్న మమ్మల్ని విడిచి ఎక్కడికో వెళ్లిపోయిండు. మా అమ్మ మల్లమ్మ నన్ను, నా అక్కను కష్ట పడి సాకింది. నేను ఇంటర్ చదువుతుండగా పక్షవాతం వచ్చి దివ్యాంగుడినైన. అయినా కష్ట పడి డిగ్రీ వరకు చదువుకున్న. మాది మంథని మండలం బెస్తపల్లి గ్రామం. వాగుకు అతి సమీపంగా మా ఇల్లు ఉండడంతో ఏటా వానకాలంలో ఇల్లు వరదలో మునిగేది. మా ఇంట్ల సామానంతా పాడయ్యేది. నా సమస్యను కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు చెప్పుకున్న. నా కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం నాకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు నా కృతజ్ఞతలు.

**- తోకల మహేశ్, దివ్యాంగుడు (మంథని)**



మంథని : పోచమ్మవాడలోని సావిత్రి భాయి పూలే డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం

### సొంతింట్ల ఉంటమని అనుకోలె



మా అమ్మ పోగు రమ, నాన్న అంజయ్య, మేమిద్దం కొడుకులం. మా నాన్న దాదాపు 10 ఏండ్ల క్రితమే చనిపోయిండు. అప్పటిసంది మా అమ్మే మమ్మల్ని కష్టపడి సాకుతంది. మాకు సొంతిల్లు లేదు. కిరాయికి ఉంటున్నం. డబుల్ బెడ్ రూం ఇంటికి దరఖాస్తు చేసుకున్నం. మంథని పోచమ్మవాడలో మా అమ్మ పేరు మీద ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. ఇన్ని రోజులు కిరాయి ఇండ్లలో ఉన్న మాకు ప్రభుత్వం సహకారంతో సొంతిల్లు వచ్చింది. మా కల నేరవేర్చిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు జీవితాంతం రుణ పడి ఉంటం.

**-పోగు శివాజీ, మంథని**



జనగామలో శిథిలావస్థకు చేరిన పురాతన ఆలయం

# ఊరి పేరే ఇంటి పేరుగా

- **గోదావరిఖనికి పురుడు పోసిన 'గుళ్ల జనగామ'**
- **కాకతీయుల కళావైభవానికి సజీవ తోరణం**
- **మూడు నిలువెత్తు శివలింగాలున్న త్రిలింగ రాజ రాజేశ్వర స్వామి ఆలయం**
- **దాదాపు 100 కుటుంబాల ఇంటి పేరైన గ్రామం**

గోదావరి నదీ పరీవాహక గ్రామం అది. కాకతీయ కళా వైభవానికి సజీవ తోరణం. ఆ ఊరుకు 12 వందల ఏండ్ల చరిత్ర. దక్షిణ భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా మూడు నిలువెత్తు శివలింగాలున్న త్రిలింగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. అదే గుళ్ల జనగ్రామ గ్రామం. దాదాపు 700 కుటుంబాలు ఉన్న ఈ ఊరులో పేరును సుమారు వంద కుటుంబాలకు ఊరుపేరునే జనగామ ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. మరోవైపు నాటి జనగామే నేటి గోదావరిఖనికి పురుడు పోసిందని చెప్పుకోవడం విశేషం.



జనగామ గ్రామం

కోల్‌సిటీ, జూలై 3 : రామగుండం నగర పాలక సంస్థ 9వ డివిజన్ పరిధిలోని జనగామ గ్రామానికి కాకతీయుల చరిత్ర ఉంది. దాదాపు 1200 ఏండ్ల చరిత్ర కలిగిన ఈ గ్రామం, అప్పట్లో గుళ్ల జనగామగా పిలువబడేది. ఎక్కడైనా శివాలయాలు తూర్పు ద్వారంగా ఉండడం సహజం. కానీ, ఇక్కడ శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి ఆలయం మాత్రం ఉత్తర ద్వారంగా ప్రసిద్ధి. దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేనివిధంగా ఈ ఆలయంలో మూడు నిలువెత్తు శివలింగాలు భక్తులకు దర్శనమిస్తుంటాయి. ఉత్తర భాగాన కి.మీ దూరంలో తూర్పు వాహినిగా గోదావరి నది కనిపిస్తుంది. ఈ ఆలయానికి ఉత్తరాన భీమేశ్వర ఆలయం, తూర్పున ఊర చెరువు, పోచమ్మ ఆలయాలు, దక్షిణాన హనుమంతుడి ఆలయం, పశ్చిమాన లక్ష్మీనారాయణ స్వామి ఆలయాలు దర్శనమిస్తాయి. అలాగే పశ్చిమాన గర్భాలయం ఆనుకొని వల్లుబండ కూడా ఉంటుంది. ఇక్కడ సంతాన లేమివారు పూజలు చేస్తే సంతానం ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

**జైనులు పాలించడంతోనే జనగామ**

జైనులు ఈ గ్రామాన్ని పరిపాలించినట్లు చరిత్ర చెబుతున్నది. క్రమేణా ఈ ఊరు గుళ్ల జనగామగా మారింది. మహిమాన్వితమైన ఆలయాలు ఉండడం, పక్కనే గోదావరి నది ఉండడంతో గుళ్ల జనగామగా పిలిచేవారు. ఒకప్పుడు ఈ ఊళ్లో వర్షాలు పడడం లేదని జనగామ ఆలయంలో 11 మంది బ్రాహ్మణులు మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకం చేయడం వల్ల వర్షాలు పడి ఊర చెరువు నిండుకుండగా మారి రైతులు ఏటా రెండు పంటలు సాగు చేసే మహాభాగ్యం కలిగిందని చెబుతారు. ఈ ఆలయానికి తూర్పున కోనేరు ఉండేది. అది కాలక్రమేణా అంతరించిపోయింది. సమీపంలో ఉన్న గోదావరి నది నుంచి ఈ ఆలయం వరకు ఒక గుహ కూడా ఉండేదట. పూర్వం మునులు గోదావరి నదిలో స్నానమాచరించి ఆ గుహ ద్వారానే ఈ ఆలయానికి చేరుకునేవారని చరిత్ర చెబుతున్నది. ఇంకా ఇక్కడి భీమేశ్వరాలయం కింద మరో దేవాలయం కూడా ఉందని చెప్పుకుంటారు.

**వంద కుటుంబాలకు ఊరిపేరే**

గ్రామంలో దాదాపు 700 చిలుకు కుటుంబాలు ఉండగా, అందులో 100 కుటుంబాలకు జనగామనే ఇంటి పేరుగా ఉన్నది. తమ పూర్వీకుల ఇంటి పేరు వేరుగా ఉన్నప్పటికీ రాను రానూ జనగామ వాళ్లు.. జనగామ వాళ్లు అంటూ పిలుస్తూ.. అదే ఇంటి పేరుగా స్థిరపడిపోయింది. మున్ముందు జనగామ ఇంటి పేరున్న వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతూనే ఉంటుందనడంలో సందేహం లేదు.

### ఎమ్మెల్యే కృషితో ఇప్పడిప్పడే అభివృద్ధి



గోదావరిఖని పుట్టిందంటే జనగామతోనే. సింగరేణికి పురుడు పోసింది కూడా జనగామే. జైనుల కాలం నాటి దేవాలయాలతో జనగామగా వచ్చింది. వెయ్యేండ్ల చరిత్ర కలిగిన జనగామను గత పాలకులు పట్టించుకోలే. స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చొరవతో జనగామ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నది. పురాతన, మహిమాన్వితమైన శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉన్న ఈ ఊరు పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిని కోరుతున్నాం.

**- ధాతు శ్రీనివాస్, కార్పొరేటర్ (8వ డివిజన్)**

### మా ఇంటి పేరూ జనగామే



నేను ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ జనగామ ఊరే మా ఇంటి పేరు. ఎక్కడైనా పరిచయం చేసుకునే సందర్భం వస్తే జనగామ కవితగా చెప్తా. మొదట్లో ఊరు పేరు అనుకుంటారు. తర్వాత ఇంటి పేరు కూడా అదేనని తెలుసుకొని ఆశ్చర్యపోతారు. జైనులు పాలించిన గ్రామంగా జనగామగా పేరువచ్చిందని పూర్వీకులు చెబుతుంటే విన్నాను. ఈ గ్రామంలో జనగామ ఇంటి పేరుతో చాలా మంది ఉన్నారని మొదట తెలిసి నేనూ ఆశ్చర్యపోయాను.

**- కవితా సరోజని, కార్పొరేటర్ (9వ డివిజన్)**